రోడ్డు ఆక్రమణ అడ్డుకోవాలని కలెక్టర్‌కు వినతి

ఘట్‌కేసర్: పట్టణంలోని సర్వే నంబర్‌– 597, 598, 599లో రోడ్డును ఆక్రమించి సాయినగర్‌లో నిర్మిస్తున్న ఇంటి పనులు నిలుపుదల చేయించాలని స్థానికుడు వీరబద్రయ్య కలెక్టర్‌కు శుక్రవారం వినతి అందజేశారు. ఆక్రమణ విషయమై మున్సిపల్‌ కమిషనర్‌కు గతంలో వినతి అందజేసిన నేటి వరకు చర్యలు తీసుకోలేదని లేఖలో తెలిపారు.

మల్కాజిగిరిలో ఆరు నామినేషన్లు దాఖలు



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గం ఎన్నికల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు ఆరు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి గౌతమ్‌ తెలిపారు. మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా ఓరుగంటి వెంకటేశ్వర్లు, పెండ్యాల సాయివరప్రసాద్‌, రాజేష్‌ మిశ్రా శివ్‌, చలిక చంద్రశేఖర్‌, ఒక్కో సెట్‌ నామినేషన్‌ పత్రాలు దాఖలు చేయగా, కుడుపూడి వీవీఎస్‌ నారాయణ రెండుసెట్ల నామినేషన్‌ పత్రాలు దాఖలు చేశారన్నారు.

ఫ్లై ఓవర్‌ పనులు పరిశీలించిన ట్రాఫిక్‌ ఏసీపీ


దుకాణదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్‌ ఏసీపీ

మేడ్చల్‌రూరల్‌: మేడ్చల్‌ పట్టణంలో 44వ జాతీయ రహదారిపై కొనసాగుతున్న ఫ్లైఓవర్‌ పనులను శుక్రవారం మేడ్చల్‌ ట్రాఫిక్‌ ఏసీపీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. మేడ్చల్‌ సీఐ హనుమాన్‌గౌడ్‌తో కలిసి పట్టణంలోని ముకుంద్‌ థియేటర్‌ సమీపంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పనులు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్‌ ఇబ్బందులు తలెత్తకుండా దుకాణదారులు నిబంధనలు పాటించాలని, దుకాణాల ముందు అడ్డగోలుగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు వెడల్పులో అధికారులు ఏర్పాటు చేసిన సూచికల పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించాలని కోరారు.

చిరుజల్లులతో హాయిగా..



మేడ్చల్‌: ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు చిరుజల్లులు కాస్త ఉపశమనం కలిగించాయి. మేడ్చల్‌ ప్రాంతంలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వాతావరణం చల్లబడింది. గాలితో కూడిన చిరుజల్లులు కురిశాయి. గాలులు వేగంగా వీయడంతో అక్కడక్కడా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గాలివానతో సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు కరెంట్‌ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

డంపింగ్‌ యార్డ్‌ బాధితులకు వసతులు కల్పించాలి

మల్కాజిగిరి: జవహర్‌నగర్‌ డంపింగ్‌ యార్డ్‌ బాధిత కాలనీవాసులకు వసతులు కల్పించాలని బీజేపీ జుగ్గిజోపిడి (మురికివాడల) విభాగం మేడ్చల్‌ జిల్లా ఇన్‌చార్జి బాబూసింగ్‌ డిమాండ్‌ చేశారు. సైనిక్‌పురిలోని మెట్రో వాటర్‌ బోర్డు కార్యాలయంలో శుక్రవారం జీఎం వి.అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో నేషనల్‌ గ్రీన్‌ ట్రిబ్యునల్‌ కోర్టు తీర్పు ప్రకారం డంపింగ్‌ యార్డ్‌ చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఉచితనీరు, వైద్యం, మౌలిక వసతులను డంపింగ్‌ యార్డ్‌ నిర్వాహకులైన ఏజెన్సీతో చేయించాల్సిన బాధ్యత కాంగ్రెస్‌ ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో నీటి బిల్లులు చెల్లించాలని నోటీసులు అందజేశారని, వాటిని విరమించుకోవాలని లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్‌ తాళ్లపల్లి లింగం, కో కన్వీనర్‌ రంగుల శంకర్‌, ముత్యం సుజాత, శివ కేశవ్‌, శ్రవణ్‌, శివ, రాజు, గణేష్‌ పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగి ఇంట్లో అగ్నిప్రమాదం

రూ.20 లక్షలకు పైగా ఆస్తి నష్టం



అల్వాల్‌: జీహెచ్‌ఎంసీ ఉద్యోగి ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిన ఘటన మచ్చబొల్లారంలో చోటుచేసుకుంది. అల్వాల్‌ జీహెచ్‌ఎంసీలో ఫుడ్‌ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే లక్ష్మీకాంత్‌ మచ్చబొల్లారం వీబీసీటీ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లోని ఐదవ అంతస్తులో నివసిస్తున్నారు. శుక్రవారం ఇంట్లోని వారు బయటకు వెళ్లగా ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు సమాచారం. పక్కన ఉండే వారు వెంటనే ఇంటి యజమాని లక్ష్మీకాంత్‌కు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది తాళం పగులగొట్టి మంటలు ఆర్పారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగకపోగా, సుమారు రూ.20 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి గాయాలు కాగా స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

బిల్డర్‌ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

ఈ అపార్ట్‌మెంట్‌లో మొత్తం స్టిల్ట్‌ ప్లస్‌ ఐదు ఫ్లోర్లు 16 బ్లాక్‌లతో మొత్తం 1,040 ఫ్లాట్లు ఉన్నాయి. అయితే సదరు బిల్డర్‌ జీహెచ్‌ఎంసీ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టారని, ఎటువంటి సెట్‌బ్యాక్‌ లేకుండా, ఫైర్‌ సేఫ్టీ లేకుండా నిర్మించడంతో ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని అపార్ట్‌మెంట్‌వాసులు వెల్లడిస్తున్నారు. ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపట్టి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని అపార్టుమెంట్‌వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

మచ్చబొల్లారం వీబీసీటీ కమ్యూనిటీ అపార్టుమెంట్‌లో జరిగిన అగ్నిప్రమాదం విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బాధితుడు లక్ష్మీకాంత్‌ను ఓదార్చి భరోసా కల్పించారు.

హాట్‌ సీట్‌.. లక్కీ చాన్స్‌

మల్కాజిగిరి లోక్‌సభ బరిలో నిలిస్తే రాజకీయ భవిష్యత్తే..

- చామకూర మల్లారెడ్డికి మంత్రి చాన్స్‌ మల్కాజిగిరి చలవే
- రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవి.. సీఎం అదృష్టం ఇక్కడి స్థాన బలమే..
- ఇక్కడ ఓడిపోయినా.. రాజకీయ ప్రాబల్యం తగ్గదని చర్చ



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: దేశంలో అతిపెద్ద నియోజకవర్గంగా పేరొందిన మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానం పలువురు రాజకీయ నాయకులకు పునర్జన్మ ఇచ్చిందనడంలో అతిశయోక్తి లేదు. మల్కాజిగిరి నుంచి ఎంపీగా గెలుపొందిన నాయకులకు తమ రాజకీయ ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగపడిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించిన నేతలకు తమ పార్టీలో అత్యున్నత పదవులు దక్కమే కాకుండా.. పాలనాపరంగా ముఖ్యమంత్రిగా, కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా పనిచేసే అదృష్టాన్ని పొందారన్న నానుడి ఉంది.

- ఈ నియోజకవర్గం నుంచి పోటి చేసి ఓడిపోయిన నేతలకు కూడా రాజకీయ రంగంలో అదృష్టం కలిసొచ్చిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. ఏది ఏమైనా, రాజకీయ పునరావాసానికి, భవిష్యత్‌కు మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానం సెంట్‌మెంట్‌గా కలిసొస్తుందని పలువురు నాయకులు భావిస్తుండటంతో.. ప్రస్తుత ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ స్థానం హాట్‌ సీటు.. లక్కీ చాన్స్‌గా మారిందనడంలో సందేహం లేదన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల నుంచి వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో ఇక్కడి నుంచి పార్టీల అభ్యర్థులుగా పోటీ చేస్తున్న ఈటల రాజేందర్‌(బీజేపీ), పట్నం సునీత మహేందర్‌రెడ్డి(కాంగ్రెస్‌), రాగిడి లక్ష్మారెడ్డి (బీఆర్‌ఎస్‌)లకు కూడా మల్కాజిగిరి సెంట్‌మెంట్‌ ఏ విధంగా కలిసి వస్తుందో వేచిచూడాల్సిందే అంటున్నారు.
- 2009లో మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానం నుంచి కాంగ్రెస్‌ అభ్యర్థిగా సర్వే సత్యనారాయణ పోటీ చేసి గెలుపొందడం వల్లే.. కేంద్రమంత్రి వర్గంలో స్థానం దక్కిందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. అలాగే, ఇదే లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసన సభ్యుడుగా గెలిచిన సర్వే సత్యనారాయణకు రాజకీయంగా అదృష్టం కలిసి వచ్చిందన్న అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో ఉన్నాయి.
- 2014లో మల్కాజిగిరి పార్లమెంట్‌ సెగ్మెంట్‌లో టీడీపీ నుంచి ఎంపీగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డికి పదవి కాలం పూర్తవకముందే.. మేడ్చల్‌ అసెంబ్లీ స్థానం నుంచి శాసనసభకు పోటీ చేసి గెలుపొంది. రాష్ట్ర మంత్రి వర్గంలో స్థానం సంపాందించుకున్నారు. ఇది కూడా మల్లారెడ్డికి కలిసొచ్చిన మల్కాజిగిరి సెంటిమెంటేనని పేర్కొంటున్నారు.
- 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్‌ నుంచి పోటి చేసి ఓడిపోయిన రేవంత్‌రెడ్డికి మల్కాజిగిరి సెంట్‌మెంట్‌ బాగా కలిసొస్తుందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా ఉంది. 2019లో అనుహ్యంగా మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి పోటి చేసి, విజయం సాధించిన రేవంత్‌రెడ్డికి టీపీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్‌ అధిష్టానం కట్టబెట్టింది. దీంతో ఆయన రాజకీయ జీవితం మలుపు తిరిగింది. అనంతరం 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ కొడంగల్‌ నుంచి పోటీ చేసి విజయం సాధించిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. రాష్ట్ర మంత్రి వర్గంలో సభ్యుడిగా పని చేయకుండానే రేవంత్‌రెడ్డి ఏకంగా సీఎం కావడం మల్కాజిగిరి సెంట్‌మెంట్‌ అనే చర్చ రాజకీయ వర్గాల్లో ప్రచారమవుతోంది.

ఓటమి చెందినా..

మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానం నుంచి 2019లో టీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మల్కాజిగిరి శాసనసభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఈ విజయం కూడా రాజశేఖర్‌రెడ్డికి మల్కాజిగిరి సెంటిమెంటేనన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

ప్రస్తుత పార్లమెంట్‌ ఎన్నికల్లోనూ..

మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నేతలు గెలిచినా.. ఓడినా తమ రాజకీయ ఎదుగుదల, భవిష్యత్‌కు ఈ స్థానం సెంటిమెంట్‌ ఎంతగానో ఉపయోగపడుతుందన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పోటీలో నిలుస్తున్న నేతలకు మల్కాజిగిరి సెంటిమెంట్‌ ఏవిధంగా తమ రాజకీయ భవిష్యత్‌కు ఉపయోగపడుతుందో.. వేచి చూడాల్సిందే.

- అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్‌, గజ్వేల్‌ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి ఈటల రాజేందర్‌ మల్కాజిగిరి పార్లమెంట్‌ స్థానంలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అలాగే, జెడ్పీ చైర్‌పర్సన్‌గా మూడు పర్యాయాలు పనిచేసిన పట్నం సునీత మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌ అభ్యర్థిగా బరిలో నిలవగా, బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి తన రాజకీయ భవిష్యత్తును పరీక్షించుకుంటున్నారు.

కేంద్రంలో మరోసారి బీజేపీ గెలవాలి


నాగారం 13వ వార్డులో ప్రచారంలో మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి తదితరులు

నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ చంద్రారెడ్డి

కీసర: దేశంలోని ప్రజలకు మేలు జరగాలంటే కేంద్రంలో మరోసారి బీజేపీ ప్రభుత్వం గెలవాలని నాగారం మున్సిపల్‌ చైర్మన్‌ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ అభ్యర్థి ఈటల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమనాయకుడు, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ఈటల రాజేందర్‌కు ఓట్లు వేసి ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కౌన్సిలర్‌ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్‌, బీజేపీ నాగారం అధ్యక్షుడు వేణుగోపాల్‌, నేతలు నక్క కిషోర్‌, రాకేష్‌, జంగారెడ్డి, అక్కాల సురేష్‌, సూర్యశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర రక్షణ మంత్రిని కలిసిన నాయకులు



ఘట్‌కేసర్‌: లోకసభ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం కలిశారు. ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ లక్ష్మణ్‌తో కలిసి ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బీజేపీ నాయకుడు గొంగ్లల బాలేశ్‌ మర్యాదపూర్వకంగా కేంద్ర మంత్రిని కలిశారు. శాలువాతో సత్కరించారు.

టీపీసీసీ మల్కాజిగిరి పార్లమెంట్‌ ఎస్సీ సెల్‌ ఇన్‌చార్జిగా మోహన్‌

మల్లాపూర్‌: టీపీసీసీ మల్కాజిగిరి పార్లమెంట్‌ ఎస్సీ సెల్‌ ఇన్‌చార్జిగా మల్లాపూర్‌కు చెందిన హెచ్‌ఆర్‌.మోహన్‌ నియమితులయ్యారు. ఈ మేరకు టీపీసీసీ ఎస్సీ సెల్‌ చైర్మన్‌ నగరిగారి ప్రీతం నూతనంగా నియమితులైన హెచ్‌ఆర్‌.మోహన్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్‌.మోహన్‌ మాట్లాడుతూ.. మల్కాజిగిరి పార్లమెంట్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చినందుకు టీపీసీసీ ఎస్సీ సెల్‌ చైర్మన్‌ నగరిగారి ప్రీతం, కాంగ్రెస్‌ ఉప్పల్‌ నియోజకవర్గ ఇన్‌చార్జీ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటి పన్నులు చెల్లించి ప్రగతికి సహకరించాలి


పన్ను వసూలు చెక్కును ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌కు అందజేస్తున్న ఆర్మీ డెంటల్‌ కాలేజీ అధికారి

జవహర్‌నగర్‌లో ఎర్లీ బర్డ్‌ కింద రూ.1.13 కోట్లు వసూలు

జవహర్‌నగర్‌: ఇంటి పన్నులు చెల్లించి ప్రగతికి సహకరించాలని జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌ ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్‌ అన్నారు. ఎర్లీ బర్డ్‌లో భాగంగా జవహర్‌నగర్‌ కార్పొరేషన్‌లో శుక్రవారం బిట్స్‌ పిలానీ, ఆర్మీ కాలేజీ, సీఆర్‌పీఎఫ్‌లలో కలిసి ఒకేరోజు రూ.1.30 కోట్లు పన్ను వసూలు చేసి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎర్లీ బర్డ్‌ ద్వారా 5 శాతం రాయితీతో ఇంటి యజమానులు పన్ను చెల్లించవచ్చని, ఇంటి యజమానులు ఎర్లీ బర్డ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బిల్‌ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మేడిపల్లి: శ్రీసాయి నిలయం, హర్షిణి రెసిడెన్సీలో అధికారులు శుక్రవారం ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రజాసామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిది అందుకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని అవగాహన కల్పించారు. మెప్మా సిబ్బంది, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్‌కు ఆదరణ


భోగారం గ్రామంలో కాంగ్రెస్‌ నేతల ఇంటింటి ప్రచారం



కీసర: మేడ్చల్‌–మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం గ్రామాల్లో కాంగ్రెస్‌ నేతల ప్రచారం జోరందుకుంది. మండలంలోని భోగారం, కీసరదాయర గ్రామాల్లో కాంగ్రెస్‌ నేతలు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కీసర మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ రామిడి విజయ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో కాంగ్రెస్‌కు ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందన్నారు. కాంగ్రెస్‌ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి ఓట్లు వేసి గెలిపించుకుంటామని ప్రజలు అంటున్నారన్నారు. అనంతరం నాగారంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. యూత్‌ కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, కాంగ్రెస్‌ నాగారం మున్సిపల్‌ పట్టణ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌ బండారి మల్లేష్‌యాదవ్‌, కౌన్సిలర్లు పంగహరిబాబు, గన్నెర్ల సత్యనారాయణ, కౌకుట్ల శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌, చక్రపాణిగౌడ్‌, జానకిరాం, తటాకం లక్ష్మణ్‌, ఉమాపతి, మల్లేష్‌, కందాడి సత్తిరెడ్డి, దయానందర్‌గౌడ్‌, రామారం ప్రదీప్‌, ముద్దం వెంకట్‌, కృష్ణారెడ్డి, ముద్దం మల్లేష్‌యాదవ్‌, నాగరాజు, బాల్‌నర్సింహ, మునిగొండ శివయ్య, రాజు, టైలర్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ బలోపేతంలో భాగస్వాములు కావాలి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్‌ కార్పొరేషన్‌ బీఆర్‌ఎస్‌ కార్యాలయంలో మేయర్‌ జక్కా వెంకట్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన నూతన సమన్వయ కమిటీల ఏర్పాటులో భాగంగా నిర్వహించిన సమావేశంలో 2వ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డివిజన్‌ నాయకులు, పార్టీ శ్రేణుల అభిప్రాయం మేరకు నూతన అధ్యక్షుడు పగడాల బాలరాజ్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వరికల శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శిగా కూర్మెల ఉపేందర్‌ను ఎన్నుకున్నారు. మేయర్‌ వారికి శుభాకాంక్షలు తెలిపి అనంతరం ఆయన మాట్లాడారు. త్వరలో డివిజన్‌ పూర్తిస్థాయి కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు బీఆర్‌ఎస్‌ను బలోపేతం చేయడంలో భాగస్వాములు కావాలన్నారు.

మోదీ సైన్యంలో పనిచేసే అవకాశం కల్పించాలి


బీజేపీలో చేరిన సుతారిగూడ గ్రామస్తులతో ఈటల రాజేందర్‌

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌



మాట్లాడుతున్న ఈటల రాజేందర్‌

మేడ్చల్‌రూరల్‌: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ గ్రామస్తులు శుక్రవారం పెద్ద ఎత్తున బీజేపీలో చేరారు. స్థానిక కౌన్సిలర్‌ రజిత వెంకటేశ్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ పాల్గొని గ్రామ నాయకులు, యువకులు, మహిళలకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లుగా మేడ్చల్‌ ప్రాంతంలో నివాసం ఉంటున్నానని, పిలిస్తే పలికేంత దూరంలో మా ఇల్లు ఉందని, ఎప్పుడు ఏ అవసరం ఉన్నా సేవకుడిగా ఉంటానన్నారు. మోదీ సైన్యంలో పనిచేసే అవకాశం కల్పించాలని, భారీ మెజార్టీతో గెలిచేందుకు కృషి చేయాలని కోరారు. ఊరంతా కలిసి బీజేపీలో చేరడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మున్సిపల్‌ కన్వీనర్‌ మోహన్‌రెడ్డి, మున్సిపల్‌ అధ్యక్షులు శ్రీనివాస్‌ ముదిరాజ్‌, కౌన్సిలర్లు మల్లికార్జున్‌ ముదిరాజ్‌, సరస్వతి, హంసరాణి, నాయకులు వెంకటేశ్‌, కృష్ణగౌడ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో బీఆర్‌ఎస్‌ గెలుపు ఖాయం


సమావేశంలో నాగారం పట్టణ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్‌ తదితరులు

కీసర: మల్కాజ్‌గిరిలో బీఆర్‌ఎస్‌ నుండి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉన్న రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని బీఆర్‌ఎస్‌ నాగారం పట్టణ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్‌ అన్నారు. ఈమేరకు నాగారం మున్సిపాలిటీలో శుక్రవారం నిర్వహించిన బీఆర్‌ఎస్‌ సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మల్కాజ్‌గిరి ఎంపీ స్థానాన్ని బీఆర్‌ఎస్‌ ఖాతాలో వేసి కేసీఆర్‌కు కానుకగా ఇచ్చేందుకు బీఆర్‌ఎస్‌ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్‌ పార్టీ పూర్తిగా విఫలమైందని, ఇక బీజేపీ అభ్యర్థికి మల్కాజ్‌గిరిలో పట్టులేదని, పార్లమెంట్‌ పరిధిలో బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలే ఉన్నందున ఇక్కడ పార్లమెంట్‌ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ గెలుపు ఖాయం అన్నారు. సమావేశంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నిమ్మల శ్రీనివాస్‌, కౌన్సిలర్లు అన్నంరాజు లావణ్యశ్రీనివాస్‌, కౌకుట్ల అనంతరెడ్డి, గూడురు సవితాంజనేయులుగౌడ్‌, కౌకుట్ల మమతాకృష్ణారెడ్డి, కొమిరెల్లి అనితాసుధాకర్‌, మోకు జగన్మోహన్‌రెడ్డి, దివ్యదయాకర్‌రావు, బదనపురం శ్రీనివాస్‌, కో ఆప్షన్‌ సభ్యులు అశోక్‌, రఫియా, జాలాల్‌పాషా, మాజీ వార్డు సభ్యులు చిన్నంరాజు సాయినాథ్‌గౌడ్‌, భాగ్యలక్ష్మీ, నాగేందర్‌, అర్చన, సంజీవ, కార్యదర్శి మచ్చ శ్రీనివాస్‌, గండి అంజయ్యగౌడ్‌, వరకాల పెంటయ్య, పైళ్ల మల్లారెడ్డి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కుషాయిగూడ: అన్ని వర్గాల సంక్షేమం జరగాలంటే కాంగ్రెస్‌ పార్టీతోనే సాధ్యమవుతుందని మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ కాంగ్రెస్‌ డివిజన్‌ అధ్యక్షుడు పోలేపాక అంజయ్య అన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మల్కాజిగిరి కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డికి మద్దతుగా డివిజన్‌ పరిధిలోని ఫేజ్‌–1, 2, ఇందిరానగర్‌, లక్ష్మీనగర్‌, రాజీవ్‌నగర్‌ కాలనీల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు జలగం వెంకటేష్‌, శ్రీనివాస్‌, శ్రావణ్‌రెడ్డి, లాజర్‌, సమ్మన్న, మల్లికార్జున్‌, మహేందర్‌, సూరి, సురేష్‌, సునీత, నిర్మల, సరళ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌ ఆక్రమణలపై ఉక్కుపాదం



ఉప్పల్‌: ఫుట్‌పాత్‌ ఆక్రమణదారులపై జీహెచ్‌ఎంసీ, ఉప్పల్‌ ట్రాఫిక్‌ పోలీసులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించి ఉక్కుపాదం మోపారు. ఉప్పల్‌ మాస్టర్‌ చెఫ్‌ హోటల్‌ నుంచి ఆర్టీఏ కార్యాలయం వరకు ట్రాఫిక్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన డ్రైవ్‌లో భాగంగా ఉప్పల్‌–నాగోల్‌ రోడ్డు ఆక్రమణలను తొలగించారు. వారం ముందుగానే ఆక్రమణదారులకు నోటీసులను అందజేసి అయినా స్పందించకపోవడంతో తొలగించినట్లు అధికారులు తెలిపారు. వ్యాపారస్తులు సర్వీస్‌ రోడ్డును పూర్తిగా ఆక్రమించి అద్దెలకు ఇవ్వడంతో పాదచారులకు నడిచేందుకు దారిలేనందున అనేక ఫిర్యాదులు అందాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలను తొలగిస్తున్నట్లు ఏసీపీ వెంకటరమణ తెలిపారు. దీంతో పాటు జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా అవసరమైన చోట భూసేకరణ చేసి జంక్షన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఈ తొలగింపు కార్యక్రమంలో మల్కాజిగిరి ట్రాఫిక్‌ ఏసీపీ శ్రీనివాసరావు, ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటరెడ్డి, ఎస్‌ఐ చిరంజీవి, టీపీఎస్‌ సురేష్‌ పాల్గొన్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు నమోదు చేయాలి



సాక్షి, మేడ్చల్‌ జిల్లా: పార్లమెంట్‌ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసిన నాటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు, అభ్యర్థుల ఖర్చుల వివరాలను నమోదు చేయాలని జిల్లా వ్యయ పరిశీలకుడు మనోజ్‌ అలోయిస్‌ లక్రా అన్నారు. కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో జిల్లా మరో వ్యయ పరిశీలకుడు ధృవ్‌ భోళాలుతో కలసి ఫ్లయింగ్‌ స్క్వాడ్‌, స్టాటిక్‌ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు, వీడియో వ్యూయింగ్‌, అకౌంటింగ్‌, షాడో టీమ్‌లతో ఆయన శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో అన్ని టీమ్‌లు సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలని సూచించారు. అనుమానాస్పద ఖాతాలను చెక్‌ చేయాలని ఇన్‌కమ్‌ టాక్స్‌, బ్యాంకు అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, సమావేశాలు నిర్వహించిన పార్టీ ప్రచార ఖర్చులు నిర్ణయించిన రేట్ల ప్రకారం నమోదు చేయాలన్నారు. కరపత్రాలు పోస్టర్లు, ఫ్లెక్సీలు ముద్రించినట్లు, ప్రింటర్‌ అండ్‌ ప్రచురణకర్తలు ఎన్నికల ప్రాతినిధ్యం చట్టం 127ఏ ప్రకారం నిబంధలను పాటించాలన్నారు.

ఎన్నికల వ్యయం నమోదు చేయాలి

ఎంసీఎంసీ ద్వారా ఎన్నికల్లో ప్రకటనలు జిల్లా మీడియా సర్టిఫికేషన్‌ అండ్‌ మానిటరింగ్‌ కమిటీ సర్టిఫికేషన్‌ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన రేట్ల ప్రకారం ఎన్నికల వ్యయం నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ కమిటీ ద్వారా రోజువారీ దినపత్రికలలో వచ్చే పెయిడ్‌ న్యూస్‌పై దృష్టి సారించాలన్నారు. సోషల్‌ మీడియాపై పటిష్ట నిఘా ఉండాలన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టేలా డబ్బులు, మద్యం పంపిణీపై ఫ్లయింగ్‌ స్క్వాడ్స్‌, ఎస్‌ఎస్‌టీ తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. లావాదేవీలపై పర్యవేక్షణ చేయాలన్నారు.

తనిఖీలు ముమ్మరం

అన్ని టీంలు జిల్లాలో చెక్‌ పోస్టుల ద్వారా నిఘా ఏర్పాటు చేశామని, పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుతో తనిఖీలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. సీ– విజిల్‌ యాప్‌, టోల్‌ ఫ్రీ నంబర్‌ 1950 కాల్‌ సెంటర్‌, గ్రీవెన్స్‌ కమిటీ సెంటర్‌, ఎంసీఎంసీ, మీడియా సెంటర్లను జిల్లా వ్యయ పరిశీలకులు తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంసీసీ నోడల్‌ అధికారి కృష్ణారెడ్డి, ఎక్స్‌పెండిచార్‌ మానిటరింగ్‌ నోడల్‌ అధికారి రాజేందర్‌రెడ్డి, నోడల్‌ అధికారులు, ఇతర టీం సభ్యులు పాల్గొన్నారు.